# భయం

డా॥ఎ. సుబ్బారావు

పద్మ తిండి ఇంకా అవకపోవడంతో, భోజనం అయిపోయినా పళ్ళెంలో వేలితో రాస్తూ ఆలోచనలో పడ్డాడు ప్రసాదు.

ప్రసూన భోజనం త్వరగా కానిచ్చేసి చదువుకోవాలని లోపలికి వెళ్ళింది.

వారం రోజుల క్రితం రవి, సుందరి విడాకులు పుచ్చుకున్నారన్న వార్త స్నేహ వర్గంలో పెద్ద సంచలనాన్ని సృష్టించింది. సుందరి, రవి, చీటికీ మాటికీ దెబ్బలాడుకున్నట్లు కనిపించినా పరిస్థితి ఇలా దిగజారిపోయిందని, ఎవరి దారులు వారు చూసుకుంటారని అనుకోలేదు. రవి ఎప్పుడూ తన సలహా అడగకపోయినా, పాతికేళ్ళ స్నేహాన్ని పురస్కరించుకుని, 'ప్రతి ఇంట్లోనూ భార్యా భర్తల మధ్య భేదం వస్తుంది, సుందరి కన్నా పెద్దవాడి వయిన నువ్వు సర్దుకోకపోతే ఎలాగ?' అని చెప్పినందుకు రవి చిరునవ్వు నవ్వి "తలనొప్పి తనదాకా వస్తే కాని తెలియదులే, అయినా చూద్దాం" అని సంభాషణని తుంచిపారేసిన దృశ్యం జ్ఞప్తికి వచ్చింది. ఆది జరిగి ఒక సంవత్సరం అయింది.

రవి పెళ్ళి కుదిర్చినది తనే అవడంమూలాన 'ఏమిటి ఇలా జరిగింది?' అని మనసు పీడిస్తోంది. మూడు నెలల క్రితం కుతుబ్ మినార్ దగ్గరికి పిక్నిక్‌కి వెళ్ళినపుడు, రవి సుందరిల ముఖభావం చరమ ఘట్టానికి వచ్చినట్లు ఎవరూ పసిగట్టలేదు.

"ఏమిటి? రవి, సుందరి వాళ్ళ విషయమేనా ఆలోచిస్తున్నారు?" అనడిగింది పద్మ.

"అవును! రవి చాలా నెమ్మదస్తుడు, అయినా ఇలా ఎందుకయిందో!"

"ఆ నా బొంద నెమ్మది! బయటకు అలా కనిపిస్తాడు, సుందరిని కాల్చుకుతినేవాడు!

"ఎందుకు నీకు తెలుసునా? నీకు సుందరి, చెప్పిందా ఎప్పుడయినా?"

"ఆ! చెప్తిందేమిటి? అలా కాకపోతే ఎందుకు విడాకులు పుచ్చుకుంటారు?"

"అలా అయి ఉంటుందిలే అని నీ ఊహ అన్నమాట. ఏదో తెలిసినట్టు, ఏమీ తెలియకుండా అనవసరంగా రవి మీద నింద వెయ్యకు, నాకు రవి గత పాతికేళ్ళుగా తెలుసు."

"సర్లెండి. మీరు మీ స్నేహితుడిని వెనకేసుకురాక సుందరిని సమర్థిస్తారా ఏమిటి?"

"నేను ఎవరినీ వెనకేసుకు రావడంలేదు. ఆధారాలు లేకుండాఎవరినీ నిందించవద్దనుకుంటున్నాను అంతే!"

"సుందరి మద్రాసు నుంచి ఎప్పుడు తిరిగివస్తుందో!"

"నాకు తెలియదు, చాలా తరుచుగా మన ఇంటికి వచ్చే రవి ఈమధ్య తగ్గించేడు."

"పూర్తిగా రావడం మానేస్తే మంచిది. అయినా వచ్చినప్పుడు ప్రసూనతో తెగ చనువుగా తిరుగుతాడు. అది నాకు ఇష్టం లేదు!"

"రవి అందరితోనూ కలుపుగోరుతనంగా మాట్లాడుతాడు. రవికి ప్రసూన పుట్టినప్పటి నుండి తెలుసు. ఆ పేరు ప్రసూనకి పెట్టింది రవే కదా! చిన్నప్పటి నుంచీ తెలిసిన ప్రసూనతో చనువుగా ఉంటే తప్పేమిటి? ఇదివరకల్లా లేని అభ్యంతరం ఇప్పుడే ఎందుకు బయటపడింది?"

"నాకు చాలా కాలం నుంచీ ఉంది అభ్యంతరం. అయితే బయటికి ఎప్పుడూ చెప్పలేదు. ప్రసూన పెళ్ళి కావలసిన పిల్ల. పెళ్ళి పెటాకులు అన్నీ అయిపోయి, బహుశా రెండవ పెళ్ళికి తయారుగా ఉన్న రవితో చనువు నాకు పనికి రాదు."

"పద్మా!"

"మీరు ఊరుకోండి, అతను మన ఇంటికి వచ్చే ఉద్దేశం వ్యక్తపరిస్తే బిజీగా ఉన్నానని చెప్పండి. అతనిని మన ఇంటికి తీసుకువస్తే తరువాత మనం ఘర్షణపడాలి!"

పద్మని – ఈ వ్యక్తినా నేను పెళ్ళాడి గత ఇరవయ్యేళ్ళుగా కాపురం చేస్తున్నది? ఈ అంతరంగంలో ఏమి ఉందో నాకు తెలియదు. 19 ఏళ్ళ ప్రసూన, ఆడవాళ్ళు, మగవాళ్ళు కలిసి ఉన్న కాలేజీకి వెళ్ళగా లేని భయం, ఉన్నట్టుండి రవి విడాకులతో వచ్చిందా? ఏమి అసందర్భపు ఆలోచన? అని అడుగుదామనుకున్నా, పద్మతో వాదం పెంచుకోవడం అర్థం లేదని తెలిసి ఊరుకున్నాడు.

లోపలి నుంచి ఈ సంభాషణ అంతా వింటున్న ప్రసూన 'లోకం ఎంత సంకుచితమైనది 'పాపం రవి చిన్నాన్న!' అనుకుని నిట్టూర్చింది.

ఎనిమిది గంటలకి మెల్లిగా తలుపు తీసుకుని లోపలికి వస్తున్న ఆనందరావుని "ఏమండీ, ఇంత ఆలస్యమయిందేమిటి?" అనడిగింది భార్య మీనాక్షి.

"ఆఫీసు అయాక, రవీ, నేనూ బాతాఖానీ వేసుకుంటే ఆలస్యమయింది, అన్నం తినేసేవా?"

"మీరు రాకుండా ఎలా తింటాను?"

"నా కిప్పుడు ఆకలిగా లేదు, రవీ నేనూ లస్సీ తాగేం, నువ్వు తినేసెయ్"

"బాగుందండీ మీరు చేసిన పని, మీ గురించి కళ్ళలో ఒత్తులు వేసుకుని నేను ఇక్కడ బిక్కు బిక్కుమని నిరీక్షిస్తుంటే మీరు అతనితో హొటలుకి వెళ్ళేరా? నేను ఒకత్తెని ఉన్నానని మీకు జ్ఞాపకం రాలేదా?"


"ఏమిటి మీనా అలా మాట్లాడుతున్నావు? రవి కష్టాల్లో ఉన్న సంగతి నీకు తెలియనిది కాదు. కొన్నాళ్ళ పాటు అతనికి కంపెనీ ఇవ్వకపోతే ఎలా?"

"ఇది ఈ వారంలో మూడవసారి అతనితో తిరుగుతూ, మీరు ఆలస్యంగా ఇంటికి రావడం. రేపటి నుంచీ మీరు తిన్నగా ఇంటికి రండి. లేకపోతే బాగోదు!"

"బెదిరిస్తున్నావా? రాకపోతే ఏం చేస్తావేమిటి?"

'వాళ్ళ విడాకులు కాదు గాని మన కాపురాన్ని కూలదోసేలా ఉంది. చూసేరా, అతనితో తిరిగి మీరు ఇంటి ఉనికే మరిచిపోతున్నారు! నన్ను రెట్టిస్తున్నారు. మీకూ విడాకులు పుచ్చుకుందామని ఉందేమిటి? అతనితో తిరిగి, అతని మాటలు వింటుంటే ఒంటరి బ్రతుకులో ఆనందం కనిపిస్తోందా? నాకు అన్యాయం చెయ్యడానికే తయారవుతున్నారా?" అంది ముక్కు చీదుతూ.

"ఛ! ఆపు నీ సణుగుడు, ఇంటికి వచ్చేనో లేదో



ప్రారంభించావు" అని లోపలికి నడిచేడు.

"ఓరి అపద మొక్కులవాడా, ఈ రవిని మా ఆయనకి దూరంగా ఉంచితే కొండకి వచ్చి నీ దర్శనం చేసుకుంటాను" అని మొక్కి మరోసారి ఎగజీదింది మీనాక్షి.

టెలివిజన్‌లో 'నుక్కడ్' ప్రోగ్రాం నడుస్తోంది. అందరూ లీనమై చూస్తున్నారు.

"ఈ వేళ రవి లంచ్ నమయంలో కనిపించేడు. రేపు శనివారం మనింటికి లంచ్‌కి పిలిచేను" అంది లక్ష్మి.

"ఎలా ఉన్నాడు?" అనడిగేడు గంగాధరం.

"ఫరవాలేదు బాగానే ఉన్నాడు."

టీ. వీ. ప్రోగ్రాం అవగానే "స్నానం చేసి వస్తాను, ఒళ్ళు చీదరగా ఉంది" అని బాత్రూంలోకి వెళ్ళింది.

"ఒరేయ్ అబ్బాయ్, నువ్వు ఒట్టి అమాయకుడివిరా!' అంది అనసూయ.

"ఏం ఎందుకని?"

"ఇప్పుడు రవిని, అందులో ఒంటరిగాడికి ఈవిడ వెళ్ళి లంచ్‌కి పిలవడమేమిటి?"

"దాంట్లో తప్పేమిటి? రవి మనకి చాలా కాలమై తెలుసును. అదీ కాక రవి లక్ష్మితో పని చేస్తున్నాడు. చదువుకునే రోజుల్లో హైదరాబాదులో రవికి లక్ష్మి మూడేళ్ళు జూనియర్."

"అందుకే నిన్ను అమాయకుడివిరా అన్నాను. పాత పరిచయాలు, పాత పరిచయాలు అంటూ పూసుకుని కాలేజీలో తిరుగుతారు అతన్నూ ఆవిడా! అతను విడాకులు తీసుకోవడ ఆశ్చర్యం ఏముంది? ఇక అడగనక్కర లేదు, ఇతరత్రా లభ్యమవుతుంటే అతనికి పెళ్ళాం బాధ్యతో ఎందుకు?"

గంగాధరం నోరు తడారిపోయింది. దగ్గ ఉన్న గంగాధరం తండ్రి రామారావు ఉలిక్కి ఏదో చెప్పబోయి, విరమించుకున్నాడు. అనసు ముందు ఆయన మాట్లాడ్డం మానేసి కాలమైంది. గంగాధరం తెప్పరిల్లి "అమ్మా కేమైనా పిచ్చా? ఒక ఆడా మగా ఒకచోట పని సంభాషిస్తే దానికి విపరీతార్థం కల్పించ న్యాయం కాదు. చాలా కాలంగా తెలిసిన



## డైరీ

'నిన్న' ని
కాలం సీసాలో బంధించి
జ్ఞాపకాల మధువుని సేవిస్తున్న
నాకు...
ఎన్ని అనుభూతుల బిందువులు
రంగుల చిత్రాలను ప్రదర్శితం చేస్తున్నాయ్
ఎన్ని అనుభవాల పొరలు
కళ్ళ చుట్టూ ప్రదక్షిణం చేస్తున్నాయ్
నిజమే...
'ఊహ'ల్లో విహరించినంత కాలం
ఈ లోకం అందాల నందన వనంగానే ఉంటుంది
'వాస్తవం'లోకి అడుగిడినప్పుడే
ముళ్ళ పందిళ్ళూ... విషక్రిములూ దృగ్గోచరమౌతాయ్.

-ఎస్వీ

లక్ష్మిల మధ్య స్నేహం ఉండకూడదా? ఆవు, అది నొచ్చుకుంటుంది'' అన్నాడు.

''ఈ ఇంట్లో నా మాట ఎవరు వింటారు? మునలిదాన్నయేక, ఇదిగో ఈయన ఇలా ఉండబట్టి నాకు విలువ పడిపోయింది'' అని రామారావు మీద విరుచుకుపడి, ''నాకు రవి మన ఇంటికి రావడం ఎంతమాత్రం ఇష్టం లేదు'' అంది మళ్ళీ.

''ఏం ఎందుకు రాకూడదు?'' అంది బాత్రూంలోంచి బయటికి వస్తూ లక్ష్మి.

''మీ ఆయన్ని అడుగు'' అని లేచి వెళ్ళింది అనసూయ.

''సాధారణంగా ఆఫీసుకి వెళ్ళి పనిచేసే ఆడవాళ్ళు మంచివాళ్ళు కారు అన్న దృఢ అభిప్రాయం మరొక్కసారి చెప్పిందిలే. రవిని భోజనానికి పిలిస్తే వాళ్ళ తగవులో మనం రవి పక్షం అయిపోయామని సుందరి అనుకుంటుందని అంటోంది'' అని తప్పుకున్నాడు గంగాధరం.

బుద్ధ జయంతికి అనుకున్న ప్రకారం పార్కులో అందరూ కలిసేరు. కొత్తగా ఢిల్లీ వచ్చిన కరుణాకరన్ కుటుంబంతో కలిపి మొత్తం ఏడు కుటుంబాలు. అందరూ ఒకచోట కూర్చుని బాతాఖానీలో పడ్డా రవిని ప్రత్యేకంగా సంభాషణలోనికి ఆహ్వానించడంలేదు. అందుచేత తెలుగురాని కరుణాకరన్, అతని భార్య కామాక్షితో పరిచయం పెంచుకుంటుండగా,

''ఏదీ మీ ఆవిడ కనిపించడంలేదే'' పుట్టింటికి వెళ్ళిందా? ఎప్పుడు తిరిగి వస్తుంది?'' అన్నది కామాక్షి.

ఒక్కసారి సంభాషణ ఆగింది. నవ్వుమణిగింది. ఏం చెప్తాడా? అని అందరి కళ్ళూ రవి మీద నిలిచాయి.

''పుట్టింటికి వెళ్ళింది, ఇక ఎప్పటికీ రాదు'' అన్నాడు మెల్లిగా రవి.

కళ్ళెత్తి కామాక్షి కళ్ళలోనికి చూసిన రవికి, ఆశ్చర్యంతో పాటు కొస్తంత విచారమూ కనిపించింది.

రవి లేచి నిలబడి, ''కాసేపు నడిచి వద్దాం, ఎవరైనా వస్తారా?'' అన్నాడు. ఎవరూ మాట్లాడలేదు.

ఆఖరికి కామాక్షి నిలబడి, ''రండి, మనమూ రెండడుగులు వేసి వద్దాం'' అని కరుణాకరన్‌ని గుంజింది. పది నిమిషాలు గడిచేక, రవి మొహంలో అలజడి తగ్గడం గమనించేక, ''ఐయామ్ సారీ, నాకేమీ తెలియదు, నేను తెలియకుండా ఈ ప్రశ్న వేశాను'' అంది కామాక్షి నొచ్చుకుంటూ.

''అనవసరంగా మీరేమీ వర్రీ కాకండి. కొన్ని నిజాలు బయటికి చేదుగా అనిపిస్తాయి'' అన్నాడు రవి.

అరగంట తరువాత తిరిగి వస్తున్న రవి, కరుణాకరన్, కామాక్షిలని చూసేసరికి, అంతవరకూ ఉన్న కోలాహలం తగ్గి, దాని స్థానే నిశ్శబ్దం మెల్లిగా చోటుచేసుకుంది.

తెచ్చుకున్న ఫలహారాలు తింటుండగా ''ప్రసాదూ నువ్వు ఇదివరలో మనమందరమూ జైపూర్ చూడడానికి వెళ్దామన్నాను. ఇప్పుడు నాకు తెలిసిన ఒక మంచి స్నేహితుడు అక్కడికి ట్రాన్స్‌ఫర్ మీద వచ్చేడు. వచ్చే నెలలో వెళదామా? ఇంకెవరైనా వస్తారా?'' అన్నాడు రవి.

ప్రసాదు ఏదో చెప్పబోయేంతలో పద్మ కలుగచేసుకుని, ''ఇప్పుడు వద్దులే ప్రసూన చదువులో వెనుకబడుతుంది అన్నాడు రవి. తరువాత ఎప్పుడైనా చూద్దాం అంది.''

ప్రసూన నోరు విప్పబోయి తల్లిని చూసి ఆగింది.

''ఏం ప్రసూనా, నేను వచ్చి నీకు సహాయం చేయనా?'' అన్నాడు రవి.

''ఎందుకూ? వద్దు. మరీ అంత వెనుకపడలేదులే. అదే చదువుకోగలదు.'' అంది పద్మ గాభరాగా.

''నేను కరోల్‌బాగ్ వెళ్ళి వస్తాను. వాన పడేలా ఉంది. కాస్త ముందుగా వెళ్ళు'' అన్నాడు ఆనందరావు. ''మేము నలుగురం స్కూటర్ మీద కష్టం. నువ్వు మాలో ఒకరికి లిఫ్ట్ ఇస్తావేమిటి అనడిగేడు ప్రసాదు రవిని.'' ప్రసూన మాతో వస్తుంది. నువ్వు బాబీని తీసుకురా అంది పద్మ.

ఇదివరలో చాలాసార్లు ప్రసూనకి రవి లిఫ్ట్ ఇచ్చేడని, ఉన్నట్టుండి ఇప్పుడు ప్రసూనకి బదులు బాబీని తీసుకెళ్ళమనడంలో తప్పు ఏమీ లేకపోయినా, ఎబ్బెట్టుగా ఉందని చెబుదామనిపించినా, పద్మలో మారుతున్న దృక్పథాన్ని వెలుపలికి తీసి అందరికీ చూపించడం ఇష్టం లేక ఊరుకున్నాడు.


రవి బాబీని తీసుకుని ప్రసాదు ఇల్లు చేరేటప్పటికి చిన్న వాన ప్రారంభమైంది. బాబీని వదిలి, లోపలికి రమ్మన్నా వినకుండా వానలో వెళుతున్న రవిని చూస్తుంటే ప్రసూన మనస్సు బాధగా మూలిగింది.

ఆరు నెలలు గడిచేక, వచ్చిన ఉత్తరాన్ని విప్పేడు ఆనందరావు.

''ప్రియమైన మిత్రులకు

ఇది ఉమ్మడిగా అందరికీ రాస్తున్న ఉత్తరం ఏదైనా ఇద్దరి మధ్య ఘర్షణ జరిగితే మూడు రకాల వ్యాఖ్యలు ఉంటాయి; నీది, ఎదుటి వ్యక్తిది అసలు నిజమైనది. ఇది నా తరఫున వ్యాఖ్యానం. సుందరి కన్పిస్తే ఆమె ఉద్దేశం మీకు చెబుతుంది బహుశా.

మీ అందరికీ నేను చాలా బీద కుటుంబంలోంచి వచ్చేనన్న సంగతి తెలుసు. మంచో, చెడో నా పెళ్ళికి పది వేలు కట్నం



తీసుకోవడం జరిగింది. ఇది సుందరికి ఇష్టం లేదుట. అయితే పెళ్ళికి ముందు అందరి ఆడ పిల్లలులాగే, 'పెళ్ళి జీవితానికి పరమావధి' అన్న నమ్మకంతో, ఆ అయిష్టాన్ని అదిమిపెట్టి పెళ్ళి చేసుకొంది. అది మొదటి తప్పు. పెళ్ళయేక ఉద్యోగరీత్యా మేము అందరికీ దూరంగా ఉన్నాం. నా కుటుంబ సభ్యులు ఎప్పుడూ నా ఇంటికి రాలేదు. దీనికి కారణం కొంత నా తమ్ముళ్ళు చెళ్ళెల్ల చదువులు పూర్తి కాకపోవడమే. ఆర్థిక సహాయం చేసే స్థితిలో నేను ఉన్నా సరిగ్గా చేయలేకపోయాను. దీనికి కారణం వేరే రాయనవసరం లేదు. 'భర్తని కట్నం ఇచ్చి కొనుక్కొన్నాను. అందుచేత నా చెప్పుచేతల్లో ఉండాలి' అని ఆధిక్యం సంపాదించడానికి ప్రయత్నం చేసి రెండో తప్పు చేసింది సుందరి. ఎవరైనా బలవంతంగా మనస్సుని కట్టి ఉంచగలరా? పిచ్చి సుందరి! నేను ఏదైనా వాదనకి దిగి, నా జీతంలోంచి తనకి ఇష్టం లేని ఖర్చు నేను స్వతంత్రంగా చేద్దామనుకున్న దృఢ నిశ్చయం తెలిసినపుడు, తను ఓడిపోతున్నానని భయపడి, "మిమ్మల్ని నేను కొనుక్కొన్నాను. మీదంటూ ఏమీ లేదు ఇక్కడ, అంత నాదే" అని బాణంని తీసి నన్ను కించపరిచేది. అది సుందరి మూడవ తప్పు. దీనివల్ల నేను తల్లితండ్రులకి, ఇతర కుటుంబ సభ్యులకి దూరమై విలవిలలాడేను.

భార్యా భర్తల మధ్య రహస్యాలు ఉండకూడదని, కాలేజీలో జరిగే ప్రతీదీ తనతో చెప్పాలనేది. పెళ్ళయేక అందరినీ వదిలేసి భర్త భార్య చుట్టూ అల్లుకుపోవాలని, భర్త ఆలోచనలు సైతం తన చుట్టూ పరిభ్రమించాలన్న కోరిక తప్పు కాదేమో! కాని మా ఊహలు సరైనప్పుడు కూడా అన్నీ తాను చెప్పినట్టే కావాలని పట్టుపట్టి ఊపిరి సలపకుండా చేసింది. భార్య దగ్గర స్వాతంత్ర్యం లభించినప్పుడే భర్త కష్టాలు చెప్పుకోగలడు. అది దురదృష్టవశాత్తు నేను అనుభవించలేదు. మాకు పిల్లలు లేకపోవడం ఒకందుకు మంచిదే. ఒక పంచ కింద ఉంటూ, దృక్పథాలు వేరయి బ్రతకలేక విడిపోయేం.

విడాకులు తీసుకోకముందు మీ ఇళ్ళకి వచ్చి మీ కుటుంబాల్లో ఒక సభ్యుడిగా మసిలాను. విడాకులు తీసుకోగానే మీ అందర్తి దృక్పథాల్లో మార్పు కనిపించింది. ఎందుకు విడాకులు తీసుకున్నారు? ఇందులో ఎవరిదైనా తప్పు ఉందా? అని మీ రెవరూ తెలుసుకోవడానికి ప్రయత్నించలేదు. కాని ఒక్కసారిగా నేను అంటరానివాడినైపోయేను. నాతో తిరిగితే మీ కాపురాలు పాడైపోతాయన్న అనుమానం కావచ్చు.

"భర్త చాలా ఆసక్తికరంగా సినిమాలో జయమాలిని డాన్స్ చూస్తే ఏమీ భయపడదు. కాని అదే పక్క వీథిలో ఉన్న గీత వేపు మోతాదుకి [ఆమె ఉద్దేశంలో] మించి చూస్తే తెగ బాధపడిపోతుంది. భర్త ఆమె వలలో పడిపోతాడని భయం. అందుబాటులో లేని జయమాలిని అయితే ఫరవాలేదు. ఏ ఆడదానికైనా అందం కాని, తెలివి కాని, చదువు కాని తన కంటె ఎక్కువ ఉన్నాయన్న అనుమానం రాగానే భర్తకి ఆ వ్యక్తితో పరిచయం పెరిగితే ఏమవుతుందో?' అని భయం. ఇది అన్ని చోట్లా జరుగుతుందని కాదు. సాధారణంగా తమ మీద తమకే నమ్మకం లేనిచోట జరుగుతుంది. ఇవేవీ కాకుండా నా విడాకులు మీ జీవితాల్లో మరొకరకమైన తలనొప్పి తెప్పించి ఉంటాయి. నాతో తిరిగితే మీరూ నా దారినే నడుస్తారన్న భయం కావచ్చు. అయితే ఇలా ప్రతీ క్షణం భర్తని కనిపెడుతూ అదుపాజ్ఞల్లో పెడితే గాని రోజులు వెళ్ళని కాపురాలు కాపురాలేనా? భర్తని ఇలా అసహజంగా కట్టి బంధించి ఉంచితే గాని నిలబడని కాపురాలకీ, మా కాపురానికీ తేడా ఏమిటి? ఒకరంటే ఒకరికి నమ్మకం లేని జీవితాలు ఎందుకు? బ్రతుకు, పెళ్ళయాక సాలెగూడులో చిక్కుకున్న ఈగలా ఉండకూడదు. అది కొందరు భరించగలరేమో! నాలాంటి వాళ్ళు భరించలేక విడాకులు పుచ్చుకుంటారు.

"స్నేహంలో ఎదుటి వ్యక్తిలో మంచే చూడాలని, స్నేహితుల్లో ఉన్న మంచినే ప్రోత్సహించాలని నమ్మిన నాకు, నా విడాకుల తరువాత, మీ అందరి ధోరణి బాధని కలిగించి మరింత క్రుంగదీసింది. నా పెళ్ళి ఒక కథ, నా విడాకులు మీ అందరి దృష్టిలో ఒక మచ్చ. ఈ అసహజ, అనిశ్చితమైన వాతావరణం నుంచి బయటపడి, మీ కందరికీ కష్టం కలగకుండా ఉండాలని నేను హైదరాబాదు వచ్చేసేను. నా స్నేహపూర్వక ఆహ్వానం మీకు ఎల్లప్పుడూ ఉంటుంది. అది అందుకునే దశలో మీరున్నప్పుడు నాకు తెలియపరచండి. ప్రసూనకి నా ఆశీస్సులు.

రవి

